# సాక్షి
# అనంతపురం

సోమవారం : 29 : జనవరి : 2024





**టమాట కిలో రూ.16**
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



**నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'**
ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కోసం సోమవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు.

గరిష్టం/కనిష్టం
**33.6°/ 16.1°**
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

## న్యూస్‌రీల్

### 8 మంది ఎస్‌ఐల బదిలీ

**అనంతపురం:** జిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. యాడికి ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డిని డి.హీరేహాళ్‌కు, బొమ్మనహాళ్ నుంచి ఆంజనేయులును కంబదూరుకు, బుక్కరాయసముద్రం నుంచి శ్రీనివాస్‌ను అనంతపురం సీసీఎస్‌కు, రామ్‌ప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తేసి డీసీఆర్‌బీకి, డి.హీరేహాళ్ నుంచి రంగడును స్పెషల్ బ్రాంచ్‌కు, పుట్లూరు నుంచి దిలీప్‌కుమార్, యల్లనూరు నుంచి ధరణిబాబును అనంతపురం ట్రాఫిక్ పీఎస్‌కు, అనంతపురం రూరల్ నుంచి మునీర్ అహ్మద్‌ను ఆత్మకూరుకు బదిలీ చేశారు.

### ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- యువతకు సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నిమిష్ పాండ్య పిలుపు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

**ప్రశాంతి నిలయం:** యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సత్యసాయి సేవా సంస్థల ఆల్ ఇండియా అధ్యక్షుడు నిమిష్ పాండ్య పిలుపునిచ్చారు. ప్రశాంతి నిలయంలో జరుగుతున్న మూడు రోజుల జాతీయ నాయకత్వ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 'ప్రేరణ -2023' పేరుతో సావనీర్ విడుదల చేశారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు సర్టిఫికెట్లను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యులు చక్రవర్తి, నిమిష్ పాండ్య అందజేశారు. అనంతరం నిమిష్ పాండ్య మాట్లాడుతూ సత్యసాయి బాబా యువతను చైతన్య పరిచారన్నారు. వారిని సమసమాజ నిర్మాణంలో భాగం చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగారన్నారు. ఆయన ఆశయాలను నిజం చేయాలన్న లక్ష్యంతో జాతీయ నాయకత్వ కోర్సును ప్రారంభించామన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువత బాధ్యతగా అడుగులు వేయాలన్నారు. సత్యసాయి సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో తండ్రి,కుమారుడి దుర్మరణం





మృతి చెందిన గురుమూర్తి, రాజేంద్ర

**పరిగి:** రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని సేవామందిరం గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ జయలత తెలిపిన మేరకు.. సేవామందిరానికి చెందిన గురుమూర్తి (57) పట్టుపరిశ్రమ శాఖలో ఉద్యోగి. ఆదివారం సాయంత్రం తన కుమారుడు రాజేంద్ర (35)తో కలిసి బిందునగర్ సమీపంలో వాకింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఓ కారు వెనకనుంచి వారిని బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలైన తండ్రీకుమారులు ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచారు. కారు డ్రైవర్ మద్యం మత్తులో నడపడంతోనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. అంతకుముందే ముల్లమొతుకపల్లికి మరో ఇద్దరిని కారు ఢీకొన్నట్లు సమాచారం. తండ్రీకుమారులను ఢీకొన్న అనంతరం కారును అక్కడే విడిచి డ్రైవర్ పరారయ్యాడు. మృతదేహాల వద్ద కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

# భారీగా కరెంటు వినియోగం

- రోజుకు 30 లక్షల యూనిట్లకు పైగా ఖర్చు
- కరెంటు కొనుగోలుకు రోజుకు రూ.2.44 కోట్ల వ్యయం
- రైతులకు కష్టం కలగకుండా వ్యయాన్ని లెక్క చేయని సర్కారు
- గడిచిన నాలుగేళ్లలో పెద్ద ఎత్తున కొత్త సర్వీసుల మంజూరు
- వేసవిలో 35 లక్షల యూనిట్లకు చేరుకుంటుందని అంచనా



**ఉమ్మడి జిల్లాలో కరెంటు వినియోగం ఇలా...**

| | |
|---|---|
| వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు | 3,13,205 |
| గృహ వినియోగ సర్వీసులు | 6,19,459 |
| రోజువారీ కరెంటు వినియోగం | 30.60 లక్షల యూనిట్లు |
| ఒక యూనిట్‌కు ప్రభుత్వం వెచ్చించే ధర | రూ.8 |
| ప్రజల నుంచి వసూలు (సగటున) | యూనిట్ రూ.2 |
| రోజుకు కరెంటు కొనుగోలుకు చేస్తున్న వ్యయం | రూ.2.44 కోట్లు |

సాక్షి ప్రతినిధి, అనంతపురం

బోరుబావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరెంటు వినియోగం భారీగా పెరిగింది. మరోవైపు గృహ నిర్మాణ రంగం విస్తరిస్తుండటంతో రోజువారీ కరెంటు వినియోగం మిగతా జిల్లాలతో పోలిస్తే ఎక్కువగా ఉంది. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల పరిధిలో రైతులకు, గృహ వినియోగం మొత్తం కలిపితే రోజుకు 30.60 లక్షల యూనిట్లు ఉంటోంది. వచ్చే వేసవి నాటికి ఈ వినియోగం 35 లక్షల యూనిట్లకు చేరుకునే అవకాశం ఉందని ఎస్పీడీసీఎల్ అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఉద్యాన పంటలకు అధిక వినియోగం..**

రాష్ట్రంలో ఉద్యాన పంటలు అంటే పండ్లు, కూరగాయల తోటలు ఎక్కువగా సాగు చేసే జిల్లాగా అనంతపురానికి పేరుంది. వీటికి ఆధారం బోరు బావులే. హార్టికల్చర్ పంటలకు ఏడాది పొడవునా కరెంటు అవసరం అవుతుంది. పైగా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో 50 వేలకు పైగా కొత్త వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చారు. అంతేకాదు రైతులకు ఇచ్చిన హామీ మేరకు 9 గంటల కరెంటు ఇస్తున్నారు. రైతుల కోసం ఎంత వెచ్చించి అయినా కరెంటు కొనుగోలు చేస్తున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

**రోజుకు రూ.2.44 కోట్ల వ్యయం..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు, 6 లక్షలకు పైగా గృహ వినియోగ సర్వీసులు ఉన్నాయి. వీటన్నింటికీ కరెంటు సరఫరా కోసం సర్కారు యూనిట్‌ను 8 రూపాయల లెక్కన కొనుగోలు చేస్తోంది. కాగా రైతులకు ఉచిత కరెంటు ఇస్తుండగా, గృహ వినియోగ సర్వీసుల నుంచి యూనిట్‌కు 2 రూపాయలు వసూలు చేస్తోంది. గరిష్టంగా అంటే మూడు రూపాయలకు మించి వసూలు చేయడం లేదు. ఈ లెక్కన కరెంటు వినియోగానికి ప్రభుత్వం భారీగా వ్యయం చేస్తోంది. కరెంటు విషయంలో రైతులకు అండగా ఉండటంతోనే రాష్ట్రంలోనే అత్యధికంగా 32 లక్షల టన్నుల ఉద్యాన పంటల దిగుబడులు సాధించినట్లు వెల్లడైంది.

### విద్యుత్ సరఫరా మెరుగుపడింది



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను రోజూ 9 గంటలు సరఫరా చేస్తున్నారు. లోఓల్టేజ్, విద్యుత్ కోత లేదు. నాణ్యమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేస్తుండడంతో మూడేళ్ల నుంచి బోరు బావుల కింద ఎక్కువ విస్తీర్ణంలో వివిధ పంటలను సాగు చేస్తున్నాం. ఈ ఏడాది రబీలో బోర్ల కింద ఆరు ఎకరాల్లో సాగు చేసిన వివిధ రకాల పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. టీడీపీ హయాంలో లోఓల్టేజ్, అప్రకటిత విద్యుత్ కోతతో పంటలకు సరిగా నీరు అందించలేకపోయాం.

– శ్రీరామరెడ్డి, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

### జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలి



నేను ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. ఇప్పుడు ఊడల దశలో పంట ఉంది. జగనన్న గవర్నమెంటు వచ్చినాక వ్యవసాయానికి 9 గంటల కరెంటు వస్తోంది. టీడీపీ పాలనలో ఎప్పుడు కరెంటు వచ్చేదో తెలిసేది కాదు. పొలం వద్దే కాచుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ బాధ ఏమీ లేదు. కరెంటు సక్రమంగా వదులుతుండటంతో పంటలకు నీరందిస్తున్నాం. రైతుల బాగు కోరే జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలి.

– శ్యామన్న, రైతు, అయ్యగార్లపల్లి, శెట్టూరు మండలం

### 9 గంటల విద్యుత్ ఇస్తున్నారు



నాకు 12 ఎకరాల పొలం ఉంది. అందులో దానిమ్మ, మొక్కజొన్న సాగు చేశాను. గతంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేది కాదు. విద్యుత్ కోతలతో ఎంతో ఇబ్బంది పడ్డాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వ్యవసాయానికి రోజుకు 9 గంటల విద్యుత్ సరఫరా అవుతోంది. రైతుల కోరిక మేరకు ఉదయం 5 గంటలు, సాయంత్రం 4 గంటలు చొప్పున వ్యవసాయ బోర్లకు కరెంటు వదులుతున్నారు.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, పి.జలాలపురం, శింగనమల మండలం

### కోతలు లేని, నాణ్యమైన విద్యుత్



ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. అయినా రైతులకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఎక్కువ ధర చెల్లించి కరెంటు సరఫరా చేస్తోంది. ముఖ్యంగా లక్షలాది మంది రైతులకు లో వోల్టేజీ, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. గడిచిన ఐదేళ్లలో వ్యవసాయానికి కొత్త సర్వీసులు ఎక్కువగా ఇచ్చాం.

– సురేంద్ర, ఎస్‌ఈ, ఎస్పీడీసీఎల్

### ముగిసిన ఏపీఎల్ టోర్నీ

**అనంతపురం:** ఏడీసీఏ, ఆర్డీటీ, యునైటెడ్ క్లబ్ - హిందూపురం, అనంత రైజింగ్ స్టార్స్, జీఎస్‌జీ జట్లతో కలసి నిర్వహించిన సీనియర్ ఏపీఎల్ మ్యాచ్‌లు ఆదివారం ముగిశాయి. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ వేదికగా సాగిన ఈ పోటీల్లో యునైటెడ్ క్లబ్, అనంత రైజింగ్ స్టార్స్ విజేతలుగా నిలిచాయి. విజేత జట్లను ఏడీసీఏ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి మధు ఆచారి, జాయింట్ సెక్రటరీ భీమలింగారెడ్డి, కోశాధికారి షబ్బీర్ అహమ్మద్, సభ్యులు మహమ్మద్ రఫీ, కోచ్‌లు శర్మాస్‌వలి, ఎస్‌ఎండీ షోయబ్, బొమ్మన్న తదితరులు అభినందించారు.

### ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

**అనంతపురం:** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు టాటా స్ట్రైవ్ సంస్థ (పులివెందుల) అడ్మిషన్ కో ఆర్డినేటర్ పద్మావతి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హౌస్ వైరింగ్‌కు సంబంధించి సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల శిక్షణ ఉంటుంది. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు, పది, ఐటీఐ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు అర్హులు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలను కల్పిస్తారు. శిక్షణ పూర్తికాగానే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 63011 62108లో సంప్రదించవచ్చు.

### నేడు తత్కాల్ కింద ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఇంటర్ పబ్లిక్ పరీక్ష రాయనున్న విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు చివరి అవకాశంగా తత్కాల్ కింద సోమవారం చెల్లించవచ్చని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, డీవీఈఓ వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.3 వేల అపరాధ రుసుంతో సోమవారం సాయంత్రం 5 గంటలలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఎవరైనా ఇంకా ఫీజు చెల్లించని ఇంటర్ రెగ్యులర్, ప్రైవేట్, జనరల్, ఒకేషనల్ విభాగాల విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియెగించుకోవాలని కోరారు. ఫీజు చెల్లించని విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# 'సాఫ్ట్ స్కిల్స్'లో మనమే మేటి

- వివిధ కోర్సుల్లో 'మైక్రోసాఫ్ట్' శిక్షణ
- జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోనే 40 వేల మంది..
- విద్యార్థులకు విలువైన, నాణ్యమైన ఉచిత శిక్షణ




దేశంలోనే తొలి 'నైపుణ్య పెంపుదల' ప్రాజెక్ట్

**అనంతపురం:** మన విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యాలతో ప్రపంచస్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో మైలురాయిని దాటింది. ఉద్యోగాన్వేషణలో అత్యంత కీలకమైన 'సాఫ్ట్ స్కిల్స్' పెంపొందించడంపై ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా అప్ స్కిల్లింగ్ ప్రాజెక్ట్ అమలు చేస్తోంది. బీటెక్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు పలు కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు సంబంధించిన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ పూర్తి ఉచితంగా కోర్సులు అందిస్తోంది. గడిచిన రెండేళ్లలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూ–ఏ) పరిధిలో ఏకంగా 40 వేల మంది విద్యార్థులు ఉచితంగా 'మైక్రో సాఫ్ట్' శిక్షణ తీసుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మైక్రోసాఫ్ట్ శిక్షణ తీసుకున్న విద్యార్థుల జాబితాలో జేఎన్‌టీయూ అనంతపురం చోటు దక్కించుకుంది.

ప్రపంచ అగ్రగామి ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు జగన్ సర్కారు పలు కోర్సులను ప్రవేశపెట్టింది. దేశంలోనే నైపుణ్య పెంపుదల నిమిత్తం నిర్వహిస్తున్న తొలి ప్రాజెక్ట్ 'మైక్రో సాఫ్ట్ అప్ స్కిల్లింగ్ ప్రాజెక్ట్' కావడం గమనార్హం. మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ ప్రొఫెషనల్ (ఎంసీపీ), మైక్రోసాఫ్ట్ టెక్నికల్ అసోసియేట్ (ఎంటీఏ) మైక్రోసాఫ్ట్ ఫండమెంటల్ విభాగాల్లో 40 రకాల కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కోర్సులే కాకుండా 'లింక్డిన్' ప్లాట్‌ఫాంతో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా లింక్డిన్‌లోని టెక్నాలజీ, క్రియేటివిటీ, బిజినెస్ విభాగాల్లో 8 వేలకు పైగా కోర్సులు విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. శిక్షణ పొందే విద్యార్థికి మైక్రోసాఫ్ట్ సంస్థ వంద డాలర్ల విలువైన గిఫ్ట్ ఓచర్లను కూడా అందిస్తోంది. మైక్రోసాఫ్ట్ అందించే కోర్సులతో పాటు ఇతర కోర్సులు, ల్యాబ్‌ల కోసం ఈ గిఫ్ట్ ఓచర్ క్రెడిట్‌ను విద్యార్థులు వినియోగించుకోవచ్చు. అజూర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అజూర్ వర్చువల్ మెషీన్స్, అజూర్ ఎస్‌క్యూఎల్ డేటాబేస్, యాప్స్ బిల్డింగ్ వంటి కోర్సులకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణతో సంబంధం లేకుండా విద్యార్థులకు అవకాశం కలుగుతుంది.

**ఒక్కో విద్యార్థిపై రూ.50 వేల దాకా ఖర్చు**

మైక్రోసాఫ్ట్ అజూర్ శిక్షణ కోసం ఒక్కో విద్యార్థికి రూ.25 వేల నుంచి రూ.50 వేల దాకా ఖర్చు అవుతుంది. రెండేళ్లలో మైక్రోసాఫ్ట్ సంస్థ ద్వారా ఏకంగా 40 వేల మంది విద్యార్థులు జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో శిక్షణ తీసుకోవడం రికార్డుగా నిలిచింది. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ విధంగా ఏ ప్రభుత్వమూ ప్రయత్నాలు చేయలేదంటూ మైక్రోసాఫ్ట్ సంస్థ శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది.

### అత్యుత్తమ అవకాశాలకు ఆస్కారం



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్, మెషీన్ లెర్నింగ్ లాంటి అధునాతన సాంకేతికత అందుబాటులోకి వస్తున్న తరుణంలో మన విద్యార్థులకు ఆ దిశగా అత్యుత్తమ నైపుణ్యాలు సమకూర్చేలా మైక్రోసాఫ్ట్ అప్ స్కిల్లింగ్ ప్రాజెక్ట్ అమలు చేశారు. దీని ద్వారా ఆయా రంగాల్లో అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉంటారు. మైక్రోసాఫ్ట్ సంస్థ అందించే ఈ సర్టిఫికేషన్ కోర్సులకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉండడంతో ఉపాధి త్వరగా లభిస్తుంది. మైక్రోసాఫ్ట్ అప్ స్కిల్లింగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. వర్సిటీ పరిధిలో ఇప్పటికే 40 వేల మంది విద్యార్థులు శిక్షణ తీసుకోవడం గమనార్హం.

– ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

### నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి



మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం 'మైక్రోసాఫ్ట్' శిక్షణ అందిస్తోంది. అత్యంత విలువైన, నాణ్యమైన శిక్షణ విద్యార్థులకు ఉచితంగా అందిస్తుండడం గర్వకారణం. ప్రైవేట్ సంస్థల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ శిక్షణ తీసుకోవాల్సి ఉంది. బీటెక్, బీఈ కోర్సులు చదువుతున్నట్లే... మైక్రోసాఫ్ట్ శిక్షణ అందిస్తుండం విశేషం. 40 రకాల కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చింది.

– ప్రొఫెసర్ సి.శశిధర్, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ అనంతపురం

### కొలువులకు సులభం



కోర్సులోనే ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించే శిక్షణ కల్పించడం, అందులోనూ జేఎన్‌టీయూ అనంతపురం విద్యార్థులు రికార్డు స్థాయిలో మైక్రోసాఫ్ట్ శిక్షణ తీసుకోవడం ఆనందదాయకం. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు కారణమయ్యాయి. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన పథకాలతో నిరక్షరాస్యత తగ్గింది. ఇందుకు గణాంకాలే నిదర్శనం.

– ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, జేఎన్‌టీయూ అనంతపురం.

### కృష్ణా జలాల ఆలస్యానికి చంద్రబాబే కారణం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



**అనంతపురం కార్పొరేషన్:** జిల్లాకు కృష్ణా జలాల రాక ఆలస్యం కావడానికి మాజీ సీఎం చంద్రబాబే కారణమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. ఉరవకొండ బహిరంగ సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే అనంత మండిపడ్డారు. హంద్రీ-నీవా గురించి చంద్రబాబు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1985లో హంద్రీ-నీవాకు ఓడీసీ వద్ద ఎన్‌టీఆర్ శంకుస్థాపన చేస్తే..1995లో చంద్రబాబు ఉరవకొండలో 40 టీఎంసీలుగా శంకుస్థాపన చేసి నాలుగేళ్లు ఏమీ చేయకుండా 1999లో దాన్ని 5 టీఎంసీలకు కుదించారని, అప్పట్లో ఉరవకొండ ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ ఉన్నారన్న విషయాన్ని గుర్తు చేశారు. కనీసం ఫౌండేషన్ ఖర్చులు కూడా ఇవ్వలేని చరిత్ర బాబుదని ధ్వజమెత్తారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత హంద్రీ-నీవా పనులు వేగవంతం చేశారన్నారు. అప్పట్లో తాను ఎంపీగా ఉన్నానని, 2005లో ఉరవకొండలో శంకుస్థాపన చేసి నీరు తీసుకువచ్చామన్నారు. 2012 నుంచి హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయని, అది మహానేత వైఎస్సార్ చలవేనన్నారు. హంద్రీ-నీవాను 3,850 క్యూసెక్కుల నుంచి 6వేలకు పెంచుతామని చెప్పి కనీసం గంపెడు మట్టి తీయని వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. టీడీపీ పాలనలోనే రైతులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కరువు విలయతాండవం ఆడడంతో వలసలు పెరిగాయన్నారు. రెయిన్‌గన్ల పేరుతో చంద్రబాబు ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. రెండు ఎకరాల నుంచి వేల కోట్లకు అధిపతి అయిన చంద్రబాబు నీతులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతిలో కూరుకుపోయారన్నారు. 2019లో ఉమ్మడి అనంతపురంలో రెండు సీట్లు టీడీపీకి వచ్చాయని, వచ్చే ఎన్నికల్లో అవి కూడా రావన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలో వస్తుందని పచ్చ పత్రికల్లో రాతలు రాసుకుని భ్రమల్లో బతుకుతున్నారన్నారు.



# హంద్రీ-నీవా ఘనత వైఎస్సార్‌దే

- 40 టీఎంసీలను 5కు కుదించిన ద్రోహి చంద్రబాబు
- ప్రాజెక్టులను అడ్డుకున్నది నీవు కాదా కేశవ్ ?
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శంకరనారాయణ, విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి. చిత్రంలో శంకరనారాయణ, పైలా నరసింహయ్య

**అనంతపురం కార్పొరేషన్:** ఉమ్మడి అనంతపురం జిల్లాకు సాగు, తాగునీరందించే హంద్రీ–నీవా ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌దేనని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండలో టీడీపీ సభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను ఒక్కటీ నెరవేర్చలేకపోయారని, అప్పట్లో రెయిన్‌గన్ల పేరిట రూ.600 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, హంద్రీ–నీవా మిగిలిపోయిన పనులకు 200 శాతం అంచనాలు పెంచి స్వాహా చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఓట్ల కోసం ప్రతి ఎకరాకూ నీరిస్తామని, 20 లక్షల ఉద్యోగాలిప్పిస్తామని అబద్ధపు హామీలతో వంచించాలని చూస్తున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడంతో పాటు టీడీపీని బంగాళాఖాతంలో కలిపేస్తారని హెచ్చరించారు. ఉరవకొండలో సభకు జనం తక్కువ సంఖ్యలో హాజరయ్యే సరికి చంద్రబాబు ఫ్రస్టేషన్‌కు గురయ్యాడన్నారు. టీడీపీ సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు.

**పయ్యావులది సైంధవుడి పాత్ర..**

ఉరవకొండలోని ఆమిద్యాల, రాకెట్ల లిఫ్ట్ ప్రాజెక్టులు, ఇప్పేరు, జీబీసీ కాలువకు నీరందకుండా అడ్డుకుని ఎమ్మెల్యే కేశవ్ సైంధవుడి పాత్ర పోషించాడని విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రాజెక్టుల కింద ఒక్క ఎకరాకైనా టీడీపీ హయాంలో నష్టపరిహారం చెల్లించారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదిన్నరలోనే రైతులకు నష్టపరిహారం చెల్లించి, అధికారికంగా నీరందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. 76 వేల ఎకరాలకు సాగునీరిచ్చేందుకు నిధులు విడుదల చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో ప్రకటించారన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ బాధితులకు పరిహారం ఇస్తామన్నారు. గుంతకల్లు, వజ్రకరూరు మండలాల్లోని చెరువులకు నీరందించేందుకు రూ.20 కోట్లు ఇస్తామని తెలియజేశారన్నారు.

**5 టీఎంసీలకు కుదించిన బాబు..**

హంద్రీ-నీవా ప్రాజెక్టును ఆనాడు 40 టీఎంసీలతో ప్రతిపాదిస్తే చంద్రబాబు ఐదు టీఎంసీలకు కుదించి.. పైగా పనులేవీ ప్రారంభించకుండా ప్రజలను మోసం చేశారని మాలగుండ్ల శంకర నారాయణ మండిపడ్డారు. వైఎస్సార్ హయాంలో రూ.6,500 కోట్లతో డీపీఆర్ తయారు చేసి, గుంతకల్లు నుంచి మడకశిర వరకు హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా తాగు, సాగునీరందించాలని, జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లతో పాటు కాలువల ద్వారా చెరువులకు నీరందిస్తూ ఆయకట్టును వృద్ధిలోకి తీసుకురావడానికి రూపకల్పన చేశారన్నారు.

కూడేరులో త్వరలోనే పరిశ్రమలు రాబోతున్నాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో తక్కువ ధరతో భూములు కాజేసి, గాలిమరల కంపెనీతో రూ.కోట్లు కొల్లగొట్టారని కేశవ్‌పై విరుచుకుపడ్డారు. పీఏసీ చైర్మన్‌గా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజేయులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పాము కాటుతో మహిళ మృతి

కుందుర్పి: మండలంలోని బండమీదపల్లికి చెందిన కోమటి మునెమ్మ (38) పాము కాటుతో మృతి చెందింది. ఆదివారం మధ్యాహ్నం ఆమె పాము కాటుకు గురి కావడంతో గమనించిన స్థానికులు వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై కుందుర్పి ఎస్‌ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### 'కియా'లో ప్రమాదం

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమలో ప్రమాదం చోటు చేసుకుని ఓ కార్మికుడు గాయపడ్డాడు. సియాన్ పరిశ్రమలో ఆదివారం విధుల్లో ధర్మవరానికి చెందిన శేఖర్ పాల్గొన్నాడు. పని ప్రాంతంలో తలకు ఇనుప రాడ్ తగలడంతో తీవ్ర గాయమైంది. తోటి కార్మికులు వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# ఖండాంతరాలు దాటిన ప్రకృతి

- 'అనంత'కు క్యూ కడుతున్న విదేశీ బృందాలు
- ప్రకృతి వ్యవసాయంలో రాణించిన జిల్లా రైతులు
- ఉమ్మడి జిల్లాలో 77,664 మంది ఇదే తరహా సాగు
- నేడు దుబాయి, షార్జా, శ్రీలంక, ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల రాక



గో ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి తెలుసుకుంటున్న విదేశీ బృందం (ఫైల్)



ప్రకృతి వ్యవసాయం కింద సాగులో ఉన్న అరటి తోటను విదేశీ బృందానికి చూపిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమమే ప్రధాన అజెండాగా... దేశంలో మరెక్కడా లేని విధంగా... గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ఏర్పాటుతో వ్యవసాయంలో నూతన విప్లవానికి జగన్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ప్రకృతి సేద్యానికి పెద్ద పీట వేస్తూ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. రాష్ట్రంలో ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్– ఏపీసీఎన్ఎఫ్) విజయవంతంగా అమలు చేస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తుండడమే ఇందుకు కారణం.

**రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక వ్యవస్థ ..**

ప్రకృతి వ్యవసాయాన్ని సుసంపన్నం చేసే దిశగా రాష్ట్ర స్థాయిలో రైతుసాధికార సంస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సంస్థకు విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.విజయ్‌కుమార్‌ను సలహాదారుగా నియమిస్తూ బాధ్యతలూ అప్పగించింది. విచ్చలవిడి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం కారణంగా గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో పెట్టుబడుల భారం పెరిగింది. భూములు నిస్సారమై దిగుబడులు లేక రైతులు నష్టాలపాలవుతూ వచ్చారు. అంతేకాక రసాయనిక ఎరువులతో సాగు చేసిన పంట ఉత్పత్తుల కారణంగా ప్రజారోగ్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పూర్వీకులు పాటించిన ప్రకృతి సిద్ధమైన సాగు విధానాలకు సాంకేతిక పరిజ్ఞానం జోడించి ప్రస్తుతం రాష్ట్రంలో, అందులోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ తరహా ప్రకృతి సాగు పద్ధతులు పెద్ద ఎత్తున చేపట్టి మెరుగైన ఫలితాలు సాధించారు. దీంతో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు ప్రపంచ దేశాలు సైతం ఉమ్మడి జిల్లా వైపు దృష్టి సారించారు. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం, పరిశీలనకు విదేశీ బృందాలు జిల్లాకు క్యూ కడుతున్నాయి. కనీసం నెలకు ఓ విదేశీ బృందం జిల్లాలో పర్యటిస్తుండడమే ఇందుకు నిదర్శనం.

**ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఇలా...**

| అనంతపురం | |
|---|---|
| ఆర్‌బీకేలు: | 127 |
| క్లస్టర్లు: | 89 |
| రైతులు: | 37,748 మంది |
| సాగు విస్తీర్ణం: | 45,075 ఎకరాలు |

| శ్రీసత్యసాయి | |
|---|---|
| ఆర్‌బీకేలు: | 131 |
| క్లస్టర్లు: | 160 |
| రైతులు: | 39,916 మంది |
| సాగు విస్తీర్ణం: | 41,413 ఎకరాలు |

**86,488 ఎకరాల్లో ప్రకృతి సాగు..**

ప్రకృతి వ్యవసాయ విధానాలతో ఉమ్మడి జిల్లా రైతులు ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా కేవలం గో ఆధారిత ఉత్పత్తులు, బెల్లం, శనగపిండి, కషాయాలు వాడుతూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట దిగుబడులు సాధిస్తున్నారు. ఇందులో చిన్నసన్నకారు రైతులు, మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 258 ఆర్‌బీకే పరిధిలో 160 క్లస్టర్ల కింద ప్రకృతి పద్ధతులు ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. 77,664 మంది రైతులు 86,488 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏ గ్రేడ్ కింద 14,879 మంది రైతులు ఉన్నారు. అలాగే 878 మంది రైతులు ఏటీఎం (ఎనిటైం మనీ) మోడల్ పద్ధతిలో ఏడాది పొడవునా ఆదాయం తీసుకుంటున్నారు. 262 మంది రైతులు బంజరు భూముల్లో కరువు నివారణ కింద పంటలు సాగు చేస్తున్నారు.

**నేడు జిల్లాలో పర్యటించనున్న విదేశీ బృందం..**

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు అనంతపురం జిల్లాలో సోమవారం నుంచి రెండు రోజుల విదేశీ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించనుంది. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా మేనేజర్ (డీపీఎం) లక్ష్మానాయక్ ఆదివారం వెల్లడించారు. ప్రధానంగా షార్జాకు చెందిన రాజకుటుంబీకుల్లో ఒకరైన షేక్ మజీద్, అలాగే శ్రీలంకకు చెందిన సర్వోదయ ఉపాధ్యక్షుడు, ఫ్యూచర్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్టర్ లింక్, దుబాయికి చెందిన మరో ప్రతినిధి రానున్నారు. వీరితో పాటు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాముల్ ఆనంద్, అమెరికా నుంచి ప్రపంచ బ్యాంకు సీనియర్ ప్రతినిధులు నలిన్ కిశోర్, అశోక్ వైష్, దేశ్‌దీప్ సహదేవ్ తదితర ప్రతినిధులూ పర్యటించనున్నారు. తొలిరోజు సోమవారం రాప్తాడు మండలం మరూరు, బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ, రెండో రోజు మంగళవారం కూడేరు మండలం చోళసముద్రం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించనున్నారు.

## జనవాక్కు

### రూ.3 లక్షలకు పైగా లబ్ధి



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నాలుగున్నరేళ్లలో మా కుటుంబానికి రూ. 3,22,656 లబ్ధి చేకూరింది. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ తదితర పథకాలు వర్తించాయి. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధి కోసం జన్మభూమి కమిటీ సభ్యులను ప్రాధేయపడినా మాకు న్యాయం చేకూరలేదు. జగనన్న ప్రభుత్వంలో నయా పైసా ఖర్చు లేకుండా ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా... జగనన్నకే మా మద్దతు. – నాగమ్మ, రంగసముద్రం గ్రామం, గుమ్మఘట్ట మండలం

### మేలు జరిగింది



మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్న మాకు సీఎం వైఎస్ జగనన్నతోనే మేలు జరిగింది. గతంలో మగ్గానికి అవసరమయ్యే ముడి సరుకు కోసం నానా ఇబ్బందులు పడేవాళ్లం. అప్పటి టీడీపీ ప్రభుత్వం కూడా మా కష్టాలు పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు అందుతోంది. ఇప్పటి వరకూ రూ.1.20 లక్షల లబ్ధి చేకూరింది. దీంతో అప్పులు చేయకుండానే ముడిసరుకు తెచ్చుకుంటున్నాం. నేత కార్మికుల కష్టాలు తీర్చిన వైఎస్ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– సి.అశ్వత్థమ్మ, ముదిరెడ్డిపల్లి, హిందూపురం

### నిరుద్యోగులను ఆదుకున్నారు



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నాలాంటి ఎందరో నిరుద్యోగుల జీవితాలు బాగుపడ్డాయి. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు అందజేశారు. అలాగే ఇంటర్ వరకూ చదువుకున్న నాలాంటి వారికి వలంటీర్‌గా పనిచేసే అవకాశం కల్పించారు. ప్రతి నెలా రూ.5 వేలు గౌరవవేతనం అందుతోంది. అమ్మ ఒడి, ఆసరా పథకాల లబ్ధి చేకూరింది. మా అత్తకు పింఛన్ వస్తోంది. దీంతో మా జీవనం సాఫీగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం.

– ప్రియాంక, ఫణారం, గుడిబండ మండలం





## టీడీపీకి శాశ్వత సమాధి తప్పదు

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి శాశ్వత సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టినా జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. చంద్రబాబులా కుటుంబాన్ని చీల్చి, పక్క రాష్ట్రాల నుంచి స్టార్ కాంపైనర్లను దింపి కుటిల రాజకీయాలు చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. ఉరవకొండలో జరిగిన చంద్రబాబు సభకు స్పందన కరువైందన్నారు. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌ను సంప్రదించకుండా ఒక్క సీటు ప్రకటించలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారన్నారు. ఇప్పటికే 80 శాతానికి పైగా అభ్యర్థులను సీఎం వైఎస్ జగన్ ప్రకటించారని, ఈ వాస్తవాన్ని కప్పి పుచ్చుతూ వైఎస్సార్‌సీపీకి అభ్యర్థులు లేరని చంద్రబాబు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్ట్‌టైం ఎమ్మెల్యేగా రాజకీయాల్లో ముద్ర వేసుకున్న ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు.

## రాష్ట్ర స్థాయి త్రోబాల్ బాలికల విజేత 'అనంత'



అనంతపురం జట్టుకు విజేత ట్రోఫీని అందజేస్తున్న కేతిరెడ్డి సుప్రియ, ఎంపీపీ బగ్గిరి త్రివేణి తదితరులు

బత్తలపల్లి: రాష్ట్ర స్థాయి త్రోబాల్ విజేతలుగా బాలికల విభాగంలో అనంతపురం, బాలుర విభాగంలో వైఎస్సార్ జిల్లా నిలిచాయి. రెండు రోజులుగా శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదిక రాష్ట్రస్థాయి త్రోబాల్ బాలబాలికల క్రీడాపోటీలు ఉత్కంఠగా సాగాయి. జిల్లా త్రోబాల్ కార్యదర్శి, దివంగత పవన్‌కుమార్‌రెడ్డి స్మారకార్థం ఈ పోటీలను నిర్వహించారు. ఆదివారం 18 జట్ల మధ్య ఉత్కంఠ పోటీలు సాగాయి. బాలికల విభాగంలో ఫైనల్స్‌కు అనంతపురం, కృష్ణా జట్లు, బాలుర విభాగంలో కృష్ణా, వైఎస్సార్ జిల్లా జట్లు చేరుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌ల్లో బాలికల విభాగంలో అనంత, బాలుర విభాగంలో వైఎస్సార్ జిల్లా జట్లు గెలుపొందాయి. విజేత జట్లను అభినందిస్తూ ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ.. ట్రోఫీలతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. విజేత జట్టుకు రూ.30వేలు, రన్నర్‌కు రూ.20వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు చొప్పున ప్రోత్సాహకాలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, సర్పంచులు చెడిపోతుల గోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి నాగభూషణ, లింగమయ్య, హరినాథ్, మాధవరెడ్డి, సోమశేఖర్, అంబికా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దంపెట్ల శివ, హ్యాండ్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి శివశంకర్, పీడీలు కేశవమూర్తి, ప్రభాకర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

## ఏపీకి న్యాయం చేయడానికి వచ్చా

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



మాట్లాడుతున్న షర్మిల

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రానికి న్యాయం చేయడానికి వచ్చానని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఆదివారం అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రత్యేక హోదా తెస్తామని ప్యాకేజీలకే పరిమితమయ్యారన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే తొలి సంతకం ఏపీకి ప్రత్యేక హోదాపై పెడతారని హామీ ఇచ్చారు. వైఎస్సార్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు 90 శాతం పూర్తయ్యాయని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మిగిలిన పది శాతం కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. 'ప్రాజెక్టు అనంత' కొనసాగించి ఉంటే జిల్లాలో యువతకు ఉపాధి దొరికేదన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన పార్టీలకు ఓటు వేస్తే అది బీజేపీకి వేసినట్లేనన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా, మాజీ మంత్రి సాకే శైలజనాథ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు


- జగన్ సర్కారుతోనే విద్యా రంగంలో సమూల మార్పులు
- ఏపీటీఎఫ్ 'విద్యా సదస్సు'లో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి స్పష్టంచేశారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు అమలు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విద్యా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడాలనే ఉద్దేశంతో డిజిటల్ విద్యను సీఎం వైఎస్ జగన్ అందుబాటులోకి తెచ్చారన్నారు. నాడు–నేడు కార్యక్రమంతో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేస్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. పీఆర్సీ అమలు, ఐఆర్ అంశాన్ని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వివిధ రకాల ధర్నాలు, బైండోవర్ కేసులను ఎస్పీతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యారంగం బలోపేతానికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలను కొనియాడారు. డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా సీఎం వైఎస్ జగన్ ఏపీలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

**జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక**

సమావేశం ముగింపులో ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ ప్రక్రియను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, రాష్ట్ర కార్యదర్శి బి. నరసింహులు కె.రవికుమార్ పర్యవేక్షించారు. నూతన అధ్యక్షుడిగా రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, మోహన్ రెడ్డి, బొమ్మయ్య, పాపిరెడ్డి, గాయత్రి, సతీష్, కార్యదర్శులుగా డేనియల్, నరేష్, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.వెంకటేశ్వర్లు, హనుమప్ప, రామాంజనేయులు, సర్దార్ వలి, రమణ, అంజలీదేవి, సుభద్ర, ప్రేమావతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వన్నప్ప, కె.రవి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## సంఘటితమైతే సమాజాభివృద్ధి



ప్రమాణ స్వీకారం చేస్తున్నఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ సభ్యులు (చిత్రంలో) టీజీ వెంకటేష్, పోతుల సురేష్

- రాజసభ్య మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్

అనంతపురం టవర్‌క్లాక్: వివిధ కమిటీలుగా ఏర్పడిన ఆర్యవైశ్యులు విభేదాలు వీడి సంఘటితమైతేనే తమ సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రముఖ వ్యాపారవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పిలుపునిచ్చారు. రాజకీయంగా తమ మార్గాన్ని కోల్పోయిన ఆర్య వైశ్య సమాజానికి తన వంతు మద్దతు ఇస్తానన్నారు. అనంతపురం జిల్లా ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం అనంతపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ టీజీ వెంకటేష్‌తోపాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోతుల సురేష్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సంఘం నూతన అధ్యక్షుడిగా సిరిగుప్ప వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పోతుల మనోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, కోశాధికారిగా సత్యరంగయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా జయలక్ష్మి, అదనపు ప్రధాన కార్యదర్శులుగా సత్రసాల మంజునాథ్, సుంకు రమేష్ రంగయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం టీజీ వెంకటేష్ మాట్లాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేసి న్యాయం చేయాలన్నారు. పేదరికంతో బాధపడుతున్న ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలతో పాటు ధనికులైన ఆర్యవైశ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ఎమ్మెల్యే స్థానాలను ఆర్యవైశ్యులకు కేటాయించాలన్నారు. పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్యులు ఎవరు ఎన్నికల్లో నిలబడినా వారికి ఆర్థిక సహకారంతో అండగా నిలవాలన్నారు. ఇతర దేశాల్లో ఉన్న ఆర్యవైశ్యులు ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే తన దృష్టికి తీసుకువస్తే వారికి తగు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, కోశాధికారి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు రామయ్య, శ్రీసత్యసాయి జిల్లా సంఘం అధ్యక్షులు రాము, అనంతపురం పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, కొత్తూరు అధ్యక్షుడు మచ్చా నరసింహులు, కలవల సతీష్‌కుమార్, ముడియం రమణ, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ కోటా సత్యం, మాజీ అధ్యక్షుడు నాగరాజు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కత్తితో దాడి

- భార్యాభర్తల మధ్య వివాదం



గాయపడిన రాజన్న

కళ్యాణదుర్గం రూరల్: దంపతుల మధ్య గొడవను సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కత్తితో తోడల్లుడు దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం ఈస్ట్‌కోడిపల్లికి చెందిన రాజన్న, సుకన్య దంపతులు. ఆదివారం కళ్యాణదుర్గంలోని జైనగర్ కాలనీలో నివాసముంటున్న సుకన్య చెల్లెలు సరస్వతి ఇంటికి రాజన్న దంపతులు వెళ్లారు. అదే సమయంలో సరస్వతితో ఆమె భర్త సురేంద్ర గొడవ పడుతుండడం గమనించిన రాజన్న జోక్యం చేసుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన సురేంద్ర... పక్కనే ఉన్న కత్తి తీసుకుని నీవెవ్వరూ మా సంసారంలో జోక్యం చేసుకునేందుకంటూ రాజన్నపై దాడి చేశాడు. తీవ్ర కత్తిపోట్లకు గురైన రాజన్నను స్థానికుల సాయంతో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### వ్యక్తికి కత్తిపోట్లు

- అర్చకత్వం విషయంలో ఘర్షణ

తాడిపత్రి: అర్చకత్వం విషయంలో తలెత్తిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన చంద్ర స్థానిక మారెమ్మ ఆలయానికి పూజారిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆయనకు బంధువైన జయరాముడు నాలుగు నెలలుగా తనకూ ఆలయ పూజారిగా హక్కు ఉందని గొడవ పడుతుండేవాడు. ఇదే అంశంపై ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం చెలరేగింది. ఆ సమయంలో జయరాముడిపై చంద్ర కుమారుడు నవీన్, అతని స్నేహితుడు సంతోష్ కత్తితో దాడి చేశారు. ఉదర భాగంలో తీవ్ర గాయమైన జయరాముడుని కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### వివాహిత ఆత్మహత్య

గార్లదిన్నె: సంతానం కలుగకపోవడంతో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం అనగానదొడ్డి గ్రామానికి చెందిన కృష్ణవేణి (36)కి గార్లదిన్నె మండలం పాపినేపాళ్యంకు చెందిన సుబ్బరాయుడుతో వివాహమైంది. పెళ్లి జరిగి 18 ఏళ్లు అయినా సంతానం కలుగకపోవడంతో కృష్ణవేణి మనోవేదనకు లోనైంది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

## క్లుప్తంగా

### కార్తికేయుడికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. స్వామి బంగారు కవచంతో మేళతాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు నిర్వహించి, మహా మంగళహారతి అందించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ, రాహుకేతు హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

### మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి


అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు జి.సూర్యుడు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూర్యుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్లకు సంబంధించి 12వ పీఆర్సీ నివేదిక సమర్పించేందుకు ఆలస్యం అవుతోందని, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు శివయ్య చారి, ఫణి భూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ నాయకులు కిష్టప్ప, ఎం. సురేష్, బాబ్జి నాయక్, ఎస్.సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన అవసరం


జేవీవీ డైరీని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గేయానంద్ తదితరులు

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ విజ్ఞానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. సమాజాన్ని శాస్త్రీయ ఆలోచనలతో నింపడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆదివారం స్థానిక జేవీవీ కార్యాలయంలో జేవీవీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథిగా హాజరైన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంపై చాలా మందికి అవగాహన లేకపోవడం వల్లే సమాజంలో ఎన్నో దురాగతాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఎంతో నష్టపోతున్నారన్నారు. మూఢనమ్మకాలవైపు మళ్లించడానికి సాగుతున్న చర్యలను ప్రభుత్వాలు కూడా పట్టించుకోవాలన్నారు. దీన్ని సరిజేయడానికి జేవీవీ కార్యకర్తలు శ్రమించాలని సూచించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు సాకే భాస్కర్, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిలాన్ బాషా, సురేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నారాయణుడికి పూజలు


అలంకరణలో శింగరబట్లు, గణపతి, నారాయణ స్వామి

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం శింగరబట్లు, గణపతి, నారాయణ స్వామికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాసం వచ్చే నెల 10 నుంచి ప్రారంభం కానునండడంతో దూరప్రాంతాలను చెందిన భక్తులు ముందుగా వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నట్లు అర్చకస్వాములు తెలిపారు. తిరునాల సందర్భంగా క్షేత్రంలో భక్తుల దర్శనార్థం ఎండవేడిమి తగలకుండా ముందు జాగ్రత్తగా చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. భక్తులకు వారు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

### 31న అశ్వత్థంలో బహిరంగ వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈనెల 31న బహిరంగ వేలం జరగనుంది. ఈ మేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. వేలం పాటలో పాల్గొను ప్రతి ఒక్కరూ ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# మేలు జరిగిన ప్రజలు దన్నుగా నిలవాలి

- ‘వైఎస్సార్ ఆసరా’ సభలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


హాజరైన పొదుపు సంఘాల సభ్యులు

రాప్తాడురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా ప్రజల గుండెల్లో గుడికట్టడమే.. జెండాలతో జతకట్టడమే చంద్రబాబు అజెండా అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మేలు చేసిన జగనన్నకు మేలు జరిగిన ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, మన్నీల, చియ్యేడు, పూలకుంట, ఉప్పరపల్లి, కందుకూరు పంచాయతీలకు సంబంధించిన ‘వైఎస్సార్ ఆసరా’ కార్యక్రమం ఆకుతోటపల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తూ, మరోవైపు సున్నా వడ్డీ రుణాలు ఇస్తూ పొదుపు సంఘాల మహిళా సభ్యులకు జగనన్న అండగా నిలిచారన్నారు. జగనన్న వచ్చినప్పటి నుంచి ఈరోజు వరకు వివిధ పథకాల ద్వారా రూ. 2.53 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 50 వేల పింఛన్లు ఇస్తున్నారన్నారు. 17 వేల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 11 వేల ఇళ్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలకు రాప్తాడు నియోజకవర్గానికి మాత్రమే ఇప్పటి దాకా రూ. 3 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు హయాంలో జిల్లా అంతటా కలిపి రూ. 3 వేల కోట్లు రాలేదని, గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో పేదల పక్షాన నిలబడిందా? అని ప్రశ్నించారు.

**ఆ పార్టీలు పొత్తులకోసం పాకులాట..**

2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని ఎమ్మెల్యే అన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఏ ఒక్కటీ పట్టించుకోలేదన్నారు. ప్రజలు పూర్తిస్థాయిలో ఛీదరించుకోవడంతో 2019 ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసన్నారు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితులు ఉండవని తెలుసుకొని టీడీపీ పొత్తుల కోసం పాకులాడుతోందన్నారు. మరోవైపు ఉనికి కోసం జనసేన పార్టీ ఏదో ఒక పార్టీతో జత కట్టేందుకు ఆరాటపడుతోందని మండిపడ్డారు. ముసలి పాములు లాంటి పార్టీలను పట్టుకొని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అధికారం కోసం తహతహలాడుతోందని ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నిపార్టీలు, ఎంతమంది కలిసినా రాష్ట్రంలో జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, చేకూరిన లబ్ధితో ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. రాష్ట్రంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి జరగలేదని అనంత పర్యటనలో విమర్శలు చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారం కోసం జెండాలన్నీ ఏకమవుతున్నాయన్నారు. కానీ జగనన్న మాత్రమే ప్రజలతో పొత్తు, ప్రజల సంక్షేమమే అజెండాగా ముందుకు వస్తున్నారన్నారు. చివరగా ఆయా పంచాయతీలకు సంబంధించిన పొదుపు సంఘాల సభ్యులకు రూ.4,73,26,674 మెగా చెక్కును ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, ఎంపీడీఓ పుల్లయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, బెడదూరి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, చియ్యేడు, ఉప్పరపల్లి, కందుకూరు సర్పంచ్‌లు గురుప్రసాద్, భాస్కర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, సావిత్రి శ్రీనివాసులు, ప్రశాంత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్తరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మారెప్ప, భారతి, రేవతి పెద్దప్ప, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, ఆనంద్, జేసీఎస్ మండల కన్వీనర్ జయచంద్రారెడ్డి, యూత్ మండల కన్వీనర్ తాడిపత్రి శీనా పాల్గొన్నారు.

## గెలుపోటములు సమానంగా తీసుకోవాలి


క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం సెంట్రల్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు మేయర్ వసీం సూచించారు. ఆదివారం పీటీసీ మైదానంలో నిర్వహించిన ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీల్లో విజయం సాధించి, నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలోని క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన ప్రథమ బహుమతి నియోజకవర్గ స్థాయిలో రూ. 35 వేలు, 2,3 స్థానంలో నిలిచిన జట్లకు రూ. 15 వేలు నగదు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎంపీడీఓ పుల్లయ్య, ఈఈ సూర్యనారాయణ, రూరల్ ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, చంద్రమోహన్‌రెడ్డి, ఇషాక్, చింతకుంట మధు, పీఈటీలు, క్రీడాకారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండ

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలిచిందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. జిల్లా రజక మహాసభ ఆదివారం ఉదయం అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో అట్టహాసంగా జరిగింది. అంతకు ముందు జిల్లా రజక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రజక మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ... రజకులను ఎస్సీల జాబితాలో చేర్చే అంశంపై తమ కృషి ఉంటుందన్నారు. కేవలం వృత్తి మీదే ఆధారపడకుండా పిల్లలను బాగా చదివించి మంచి భవిష్యత్తును అందించాలన్నారు. రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణస్వామి మాట్లాడుతూ... రాబోవు ఎన్నికల్లో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని రజకులకు కేటాయించాలని కోరారు. రజక కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా రూ.500 కోట్లు నిధులు కేటాయించి, యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలన్నారు. చేనేత, గౌడ కులస్తులకు ఇస్తున్న తరహాలోనే 50 ఏళ్లు పైబడిన రజక వృత్తిదారులకూ పింఛన్ మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు సమగ్ర రక్షణ చట్టం తీసుకురావాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యక్కలూరు రంగనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమ్మన్న, రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### రేపు త్యాగరాజస్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: నగరంలో విజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో సంగీత సద్గురువులు త్యాజరాజస్వామి 177వ ఆరాధనను నిర్వాహకులు మొదలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు త్యాగరాజ స్వామికి పంచామృతాభిషేకాలు, పలువురు సంగీత విద్వాంసులతో పంచరత్న గాన సేవలు జరుగుతాయి. సాయంత్రం బెంగళూరు సంగీత విద్వాంసులు అభిరామ్ బృందాలు, స్థానిక సంగీత కళాకారులు కర్ణాటక కచేరీ నిర్వహిస్తారు.

## ముగిసిన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్


లఘుచిత్రోత్సవంలో జ్ఞాపికలు అందుకున్న ముఖ్య అతిథులు

అనంతపురం కల్చరల్: నగరంలో వారం రోజుల పాటు సందడిగా సాగిన అనంత లఘుచిత్రోత్సవం ఆదివారం ముగిసింది. సినీ దర్శకుడు, నిర్వాహకుడు రషీద్‌బాషా ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ సాగిన 6వ అనంత చిత్రోత్సవ ముగింపు వేడుకల్లో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, అడిషనల్ ఎస్పీ హనుమంతు, సినీ పరిశ్రమ నుంచి కట్టా వెంకట్, వెంకటేశ్వర ప్రభు తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పెద్ద నగరాలకే పరిమితమైన చిత్రోత్సవాలను అనంతలో నిర్వహించేందుకు కృషి చేసిన రషీద్‌బాషాను అభినందించారు. ఉత్తమ జ్యూరీ అవార్డులకు ఎంపికైన మొదటి మూడు చిత్రాలకు, ఉత్తమ కొరియోగ్రాఫర్‌కు, అనంత సంస్కాృతిక వారసత్వ వైభవంపై వచ్చిన మొత్తం 21 లఘుచిత్రాలకు రూ.5 వేలు చొప్పున బహుమతులు అందించారు. అనంతరం సీనియర్ రచయిత కంబదూరు నబీరసూల్ రచించిన ‘కమ్మని కంఠం’ నాకు లేదు పుస్తకాన్ని జిల్లా రచయితలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సామాజిక సేవా కార్యకర్తలు అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జగన్‌మోహనరెడ్డి, ఆర్‌టీఐ అధ్యక్షులు హొన్నూరప్ప, వీరనరసింహారెడ్డి, జాకీర్, పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.

## చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

- సంక్షేమం, అభివృద్ధికి మీరే సాక్ష్యం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


భాగ్యనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని, అప్పట్లో ఏవైనా పథకాలు వర్తించాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగర చరిత్రలో లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి అందించామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 9,10వ డివిజన్లకు సంబంధించి భవానీనగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు జరిగిన మేలును వివరిస్తూనే, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాటలను స్థానిక ప్రజలు అంగీకరించారు.

**నియోజకవర్గానికి నాటి పాలకులే ద్రోహం..**

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ గ్రూపు రాజకీయాలు చేసి, నియోజకవర్గానికి తీరని ద్రోహం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేవలం రెండున్నరేళ్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామన్నారు. 9,10 డివిజన్లలో రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో నడవలేని స్థితిలో ఉన్న వీధుల్లోనూ రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొన్ని పనులు టెండర్లు పూర్తయ్యాయని, రానున్న రోజుల్లో వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్‌చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు దేవి, లక్ష్మిదేవి, సాకే చంద్ర, టీవీ చంద్రమోహన్ రెడ్డి, అబూసలేహా, సంపంగి రామాంజనేయులు, జయలలిత, లీలావతి, లావణ్య, సుమతి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, కృష్ణవేణి, పార్టీ సీనియర్ నేతలు అనంత చంద్రారెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు చింతకుంట మధు, రఫి,లక్ష్మణ్, రామయ్య, జావెద్, ఉష, శోభారాణి, శోభాబాయి, భారతి, దేవి, గౌరి, తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాను గుర్తుకే ఓటు వేయమని చూపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళలు

### ఘనంగా పుష్యార్క హోమం


పుష్యార్క హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పుష్యమాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం పుష్యార్క హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుకు స్వాముల చిత్రపటాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తులు కోరిన కోర్కెలు తీరాలని, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఆలయ యాగశాలలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

### యోగా శిక్షకురాలు కృష్ణవేణి ప్రతిభ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రెండో రోడ్డు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో యోగా శిక్షకురాలుగా ఉన్న కృష్ణవేణి ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పరేడ్‌లో ప్రతిభ చూపారు. ఈ నెల 26న జరిగిన పరేడ్‌లో కృష్ణవేణి, వారి బృందం యోగాసనాల ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణవేణి బృందాన్ని కేంద్ర మంత్రి శరభానంద్ సోనోవాల్ ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు.

### సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

## సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నార్పలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నార్పల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరు కావడంతో వారిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో వారు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. దాదాపు 32 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరికొకరు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ దాదాపు 32 ఏళ్ల తర్వాత అందరినీ కలుసుకోవడం ఆనందకరమన్నారు. తాము విద్య నేర్పిన విద్యార్థులు ఇప్పుడు అన్ని రంగాలలో స్థిరపడినందుకు సంతోషంగా ఉందన్నారు. చివరగా విందుతో కార్యక్రమాన్ని ముగించారు.

### సృష్టిని కాపాడాలి

పామిడి: దేవుడు సృజించిన సృష్టిని కాపాడాలని పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ పేర్కొన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర మొదటి నెల అంత ఆదివారాన్ని పురస్కరించుకొని ఆరాధనోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు సృష్టిని సంరక్షించి ఏలు అధికారాన్ని మానవులకు ప్రాప్తింపజేశాడన్నారు. మానవ మనుగడుకు ఎంతగానో తోడ్పడే సృష్టికి మానవులు విఘాతం కలుగజేస్తున్నారన్నారు. తద్వారా భూకంపం, సునామీ వంటి విపత్తులు కలుగుతున్నాయన్నారు. దీనిదృష్ట్యా సృష్టిని సంరక్షించి కాపాడాల్సిన బాధ్యత మానవులపై ఉందన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జయరాజు, రత్నరాజు, ఇల్లూరు రాజు, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణ, రజని, ప్రిస్కిల్లా, జయామణి, రేచెల్, వాణి, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ రైతు మృతి

కనగానపల్లి: చెట్టుపై నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు పీ ఈశ్వర రెడ్డి (60) ఆదివారం మృతి చెందాడు. మండలంలోని మామిళ్లపల్లికి చెందిన రైతు ఈశ్వరరెడ్డి వారం రోజుల క్రితం పొలం దగ్గర చెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా జారి కింద పడ్డాడు. ఆ సమయంలో అతని వెన్నెముక విరిగింది. దీంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. బసినేపల్లి తండాకు చెందిన తిరుపాల్ నాయక్ బైక్‌పై పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా ఆసుపత్రి సమీపంలో ముందు వెళుతున్న బైక్‌ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో తిరుపాల్ నాయక్, మరో బైక్‌పై వెనుక కూర్చున్న సావిత్రి గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### వివాహిత అదృశ్యం

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన రమీజాబీ 10 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. బాధితురాలి భర్త పాషావలి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి బాధితురాలి కోసం గాలింపు ప్రారంభించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## అ‘పూర్వ’ కలయిక


ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 1992-93 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చదివిన పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులు అంకిరెడ్డి, వెంకటేశ్వర్లు, తిక్కస్వామి, సావిత్రమ్మ, రామాంజనేయరెడ్డి, షిర్డీనాథ్‌కు శాలువా కప్పి సన్మానం చేశారు.

## విశ్రాంత జైళ్లశాఖ ఉద్యోగుల ఆత్మీయ కలయిక

అనంతపురం అగ్రికల్చర్: విశ్రాంత జైళ్లశాఖ ఉద్యోగుల సంఘం (ప్రిసన్స్ డిపార్ట్‌మెంట్ పెన్షనర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కారాగారముల అధికారి కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. కార్యక్రమానికి 75 మందికి పైగా విశ్రాంత జైళ్లశాఖ ఉద్యోగులు హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఫజుల్ హక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 75 ఏళ్లు పూర్తయిన ఐదుగురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ఫజుల్‌హక్